క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు కాకాణి నివాళి


నివాళులర్పిస్తున్న కాకాణి

పొదలకూరు: మండలంలోని తోడేరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఒంటేరు ధన్‌రాజ్ (33) సోమవారం మృతిచెందాడు. ధన్‌రాజ్ రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో ఇంటి వద్ద మృతిచెందడంతో సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తోడేరుకు చేరుకుని ధన్‌రాజ్ మృతదేహానికి పూలమాలలు వేసి వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు సోదర సమానుడైన ధన్‌రాజ్ మృతిచెందడం తీరని లోటుగా పేర్కొన్నారు. కాకాణి వెంట మాజీ సర్పంచ్‌లు ఏనుగు శశిధర్‌రెడ్డి, అట్ల రవీంద్ర, ప్రభాకర్ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్ అదుపుతప్పి ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన మండలంలోని పుంజులూరుపాడు సమీపంలో సోమవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. పొదలకూరుకు చెందిన అశోక్, సురేష్ పని నిమిత్తం బైక్‌పై ముత్తుకూరుకు వెళ్లారు. తిరిగి పొదలకూరుకు బయలుదేరారు. ఈ క్రమంలో పుంజులూరుపాడు సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో అశోక్, సురేష్ గాయపడగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరుణుడిపైనే ఆశలు

నిన్నమొన్నటి వరకు అధిక ఉష్ణోగ్రతలతో జనం అల్లాడిపోయారు. రైతులైతే వాన కోసం ఎంతగానో ఎదురు చూశారు. తాజాగా కురిసిన వర్షంతో అందరూ కొంతమేర ఉపశమనం పొందారు. చెరువుల్లోకి నీరు చేరకున్నా ఎండల వేడిమి తగ్గి మెట్టపంటల సాగుకు అనుకూలిస్తున్నట్టు వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.

- మొన్నటి వరకు ఎండలు.. నేడు మోస్తరు వర్షాలు
- ఈనెలాఖరు వరకు సాగుకు అవకాశం
- ఎల్లో ముజాయిక్‌ను తట్టుకునే వీబీఎన్ – 8

పొదలకూరు: పొదలకూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. మొన్నటి వరకు ఎండలు అధికంగా ఉండడంతో మెట్టరైతులు మినుము, పెసర పంటల సాగుకు సమాయత్తం కాలేదు. కొందరు మాత్రం దుక్కి దున్నకం పనులు పూర్తి చేసి వర్షం కోసం ఎదురు చూడసాగారు. మండల ప్రాంతంలో ఆదివారం రాత్రి 24 మి.మీ వర్షపాతం నమోదైంది. సోమవారం కూడా భారీ వర్షం కురిసింది. దీంతో మెట్టపంటలకు మేలు జరుగుతుందని భావిస్తున్నారు. నిమ్మ తోటల రైతులు మరో 15 రోజులు నీరు పెట్టాల్సిన అవసరం లేకుండా పోయింది. తోటల్లో సైతం అంతరపంటలుగా మినుము, పెసరతోపాటు కందిని కూడా సాగు చేయాల్సిందిగా అధికారులు తెలిపారు.

మొన్నటి వరకు ఇలా..

సెప్టెంబర్‌లో, అక్టోబర్‌లో మొన్నటి వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. స్వల్పంగానైనా వర్షాలు కురిస్తే మెట్టరైతులు మినుము, పెసర, పచ్చిశనగ, కంది పంటల సాగుకు సమాయత్తం అయ్యేవారు. అయితే వాతావరణం అనుకూలించక పోవడంతో మెట్టపంటల సాగు జోలికి వెళ్లలేదు.


గతేడాది చేపట్టిన మినుము సాగు (ఫైల్)


సాగుకు సిద్ధం చేసుకున్న మెట్టభూమి

ఈనెలాఖరు వరకు పంట సాగుకు అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వానలు పడడంతో స్వల్పంగానైనా పంటలు పండించేందుకు రైతులు పూనుకుంటున్నారు. ఈ ప్రాంతంలో గతంలో 5 వేల ఎకరాల్లో మినుము, పెసర సాగు చేసేవారు. నేడు 500 ఎకరాల్లో మాత్రమే సాగు చేసే పరిస్థితులు ఏర్పడ్డాయి. చాలామంది బయటి ప్రాంతాలకు వెళ్లి మినుము సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతానికి చెందిన కొందరు చిత్తూరు, తిరుపతి జిల్లాలకు వెళ్లి మెట్టపంటల సాగు చేస్తున్నారు.

ఇలా చేస్తే..

మినుములో ఎల్లో ముజాయిక్ (తెల్లదోమ, పేనుబంక తెగులు)ను తట్టుకునే వీబీఎన్ – 8 రకం విత్తనాలను వ్యవసాయాధికారులు రైతులకు అందజేస్తున్నారు. మెట్టపొలాలు ఉన్న ప్రతి రైతుకు 4 కిలోల బ్యాగ్‌ను ఉచితంగా ఇస్తామంటున్నారు. కొత్తగా తెగుళ్లను ఎదుర్కొనేందుకు వచ్చిన వీబీఎన్ – 8 రకం మినుము విత్తనాలను సాగు చేసి చూడాలని సూచిస్తున్నారు. నిమ్మతోటలు ఎక్కువ ఉన్న రైతులు అంతరపంటగా సాగు చేసి పరిశీలించాల్సిందిగా సలహాలిస్తున్నారు. తెగుళ్లను తట్టుకుని నిలవడితే వచ్చే ఏడాది కూడా ఇదే రకం విత్తనాన్ని విత్తుకోవచ్చని చెబుతున్నారు.

నిమ్మతోటలకు మేలు



ప్రస్తుతం కురుస్తున్న వర్షంతో నిమ్మతోటలకు మేలు చేకూరుతుంది. వరిసాగుకు పనికొచ్చే వాన పడలేదు. మెట్టపంటల సాగుకు అదును తప్పి కురుస్తున్నందున రైతులు సాగు చేసే పరిస్థితి లేదు. సెప్టెంబర్ చివరిలో మినుము, పెసర విత్తితే దిగుబడి బాగా ఉండేది.

– వి.దయాకర్‌రెడ్డి, రైతు, కల్యాణపురం

కొత్త విత్తనాన్ని సాగు చేయాలి



మెట్టరైతులు కొత్తరకం మినుము విత్తనాన్ని సాగు చేసి చూడాలి. తెల్లదోమ, పేనుబంక వల్ల మినుము పంట ఆకులు పసుపు పచ్చగా మారి దిగుబడి రాలేదు. ఆ రెండు తెగుళ్లను వీబీఎన్ – 8 రకం విత్తనం ఎదుర్కొంటుంది. తద్వారా రైతులకు దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది. 4 కిలోల మినుముల బ్యాగ్‌ను ఉచితంగా అందజేస్తున్నాం.

– ఎ.వాసు, ఏఓ, పొదలకూరు

గ్రామాల్లో దసరా ఉత్సవాలు


మనుబోలు: చాముండేశ్వరీదేవి అలంకారంలో..

మనుబోలు: దసరా ఉత్సవాల్లో భాగంగా మనుబోలు దసరా చావిడి, కోదండరామపురం, పోలేరమ్మ ఆలయాల వద్ద కార్యక్రమాలు జరిగాయి. సోమవారం చివరి రోజు కావడంతో పెద్దఎత్తున సందడి నెలకొంది. విద్యుత్ దీపాలతో రూపొందించిన దేవతామూర్తుల ఆర్చిలు ఆకట్టుకుంటున్నాయి. అలాగే కేఆర్‌పురం సెంటర్‌లో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.

- మనుబోలు పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు సోమవారం చాముండేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు శ్రీనివాసులు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఉభయకర్తలుగా విజ్జగిరి వెంకట్రావు, పుష్ప దంపతులు వ్యవహరించారు.
- పొదలకూరు: దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం చివరిరోజున శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు శయ్య అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఊంజల సేవ నిర్వహించారు. తన్నీరు బాలకష్టయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు ఉభయకర్తగా వ్యవహరించారు.


అమ్మవారు


బుచ్చిరెడ్డిపాళెం : మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు


కోవూరు : భారీ వర్షానికి ఇంట్లోకి వెళ్తున్న వర్షపునీరు


విడవలూరు : అధికారులకు సూచనలు ఇస్తున్న జెడ్పీ సీఈఓ


కొడవలూరు: వినాయక నగర్ గిరిజనులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్బారావు


మనుబోలు: లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న తహసీల్దార్


కొలనకుదురు తుఫాన్ షెల్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఎడతెరిపి లేని వర్షం

అల్పపీడన ప్రభావంతో కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో ఎడతెరిపి లేని వర్షం కురిసింది. సోమవారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన వర్షం సాయంత్రం వరకు కూడా కొనసాగింది. దీనివల్ల లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. మరో రెండు రోజులపాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉండదంతో అధికారులు అప్రమత్తమయ్యారు. లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా తీరప్రాంత గ్రామాల్లో చలిగాలులు వేగంగా వీస్తున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా మారింది. మత్స్యకారులు వేటకు విరామం పలికారు.

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- తీరంలో అల్లకల్లోలం

కోవూరు : మండల పరిధిలో కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలు, రోడ్లలో నీరు నిలిచింది. ప్రధానంగా కోవూరు శాంతినగర్‌లో రోడ్లు పూర్తిగా వర్షపు నీటితో మునిగిపోయాయి. పలు ఇళ్లలోకి వర్షపునీరు చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా పెన్నా పరీవాహక ప్రాంతాలైన పోతిరెడ్డిపాళెం, జమ్మిపాళెం, వేగూరు, చంద్రమౌళి నగర్ గిరిజన కాలనీ తదితర లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యే ప్రమాదం ఉంది. దీంతో అధికారులు స్థానికంగా పర్యటించి ప్రజలకు సూచనలు చేశారు. ఇళ్ల నుంచి బయటకు రావద్దని కోరారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నిర్మలానంద బాబా తెలిపారు.

- భారీ వర్షాల నేపథ్యంలో కోవూరులో విద్యుత్‌శాఖ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రమేష్‌చౌదరి తెలిపారు. కోవూరు డివిజన్ పరిధిలోని కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఇందుకూరుపేట, విడవలూరు, కొడవలూరు, సంగం మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు. వర్షం కురుస్తున్న సందర్భాల్లో ప్రజలు విద్యుత్ స్తంభాలను తాకవద్దని, లైన్ల కింద నిలబడవద్దని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, లైన్లు తెగిపడడం లాంటి ఘటనలు జరిగితే తక్షణమే సమీపంలోని విద్యుత్ శాఖ అధికారులకు లేదా కంట్రోల్ రూమ్ నంబర్ 9705200708కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎగసిపడుతున్న అలలు

ఇందుకూరుపేట: అల్పపీడన ప్రభావంతో మైపాడు తీరంలో అలలు ఎగసిపడుతున్నాయి. తీరం వెంబడి వేగంగా గాలులు వీస్తున్నాయి. ప్రతికూల వాతావరణం కారణంగా మత్స్యకారులు వేటకు తాత్కాలికంగా స్వస్తిపలికారు. తమ వేట సామగ్రిని తీరం వెంబడి భద్రపరుచుకున్నారు. భారీ వర్షంతో మైపాడు బీచ్‌కు పర్యాటకుల రాక తగ్గింది. కాగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో జనజీవనం స్తంభించిపోయింది. వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడ్డారు.

ఆర్డీఓ పరిశీలన

భారీ వర్షాల నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు ఆర్డీఓ నాగసంతోష్ అనూష అన్నారు. మండలంలోని రాముడుపాళెం, మైపాడు, గంగపట్నం తదితర తీర ప్రాంతాల్లో సోమవారం ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల్లోని తుఫాన్ షెల్టర్ భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ వరకు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా ముందుస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణప్రసాద్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అప్రమత్తం కావాలి

బుచ్చిరెడ్డిపాళెం : భారీ వర్షాల నేపథ్యంలో ప్రతి అధికారి అప్రమత్తంగా ఉండి ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. మండలంలోని పెన్నా పరీవాహక ప్రాంతాలైన దామరమడుగు పల్లిపాళెం, కాగులపాడు గిరిజన కాలనీ, జొన్నవాడ, మినగల్లు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల వారిని సందర్భానుసారంగా పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీహరి, సీఐ శ్రీనివాసులు రెడ్డి, నీటిపారుదల శాఖ, విద్యుత్ శాఖాధికారులు పాల్గొన్నారు.

కమిషనర్ పర్యటన

బుచ్చి నగరంలో ముంపునకు గురైన జగనన్న కాలనీలను నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు బుచ్చిరెడ్డిపాళెంలోని పెద్దూరు మంగలి కట్ట వద్ద జగనన్న కాలనీ జలమయమయ్యాయన్నారు. అనంతరం వరద బాధితులను పరామర్శించారు. కాలనీ వాసులకు అందుతున్న సహాయక చర్యలు, పారిశుద్ధ్య చర్యలను మెరుగుపరచాలన్నారు. తక్షణమే వరదనీరు పోయే విధంగా చర్యలు తీసుకుని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. వరద కాలువ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు.


కోవూరు శాంతి నగర్‌లో రోడ్డుపై నిలిచిన నీరు

సురక్షిత ప్రాంతాలకు గిరిజనులు

కొడవలూరు: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని నార్తురాజుపాళెంలో ఎంపీడీఓ ఏవీ సుబ్బారావు సోమవారం పర్యటించారు. లోతట్టు ప్రాంతంలో ఉన్న వినాయక నగర్ గిరిజన కాలనీలోని 25 కుటుంబాలను స్థానిక జెడ్పీ హైస్కూల్‌లోకి తరలించారు. వీరికి భోజన వసతి కల్పించాలని పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో రెండ్రోజుల పాటు భారీ వర్షాలున్నాయని హెచ్చరికలు వెలువడిన నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లోని వారంతా సురక్షిత ప్రాంతాలకు రావాలని సూచించారు. వారికి ప్రభుత్వం ద్వారా అన్ని వసతులు కల్పిస్తామని స్పష్టం చేశారు. అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎంపీడీఓ వెంట ఈఓపీఆర్డీ శాయిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శ్యామ్ సుందర్, వీఆర్వోలు ఉన్నారు.

జెడ్పీ సీఈఓ పరిశీలన

విడవలూరు : భారీ వర్షాలు కురుస్తున్న తరుణంలో తీర ప్రాంతాలైన రామతీర్థం, రామచంద్రాపురం, పెద్దపాళెం పంచాయతీలపై అధికారుల ప్రత్యేక దృష్టి సారించారు. అదేవిధంగా రామతీర్థంలోని తుఫాన్ షెల్టర్ కేంద్రాన్ని జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. మండల పరిధిలో అధిక వర్షపాతం నమోదు కావడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ నగేష్‌కుమారి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

తెల్లవారుజాము నుంచి..

వెంకటాచలం: మండలంలో సోమవారం తెల్లవారుజాము నుంచి జోరుగా వర్షం కురిసింది. గొలగమూడి గ్రామంలోని ఎస్సీ కాలనీలో వర్షపునీటితో వీధులు జలమయమయ్యాయి. ఓ వీధిలో నీటి కారణంగా స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. పంచాయతీ అధికారులు జేసీబీతో పూడిక తొలగించి నీరు నిల్వ లేకుండా చేశారు.

లోతట్టు ప్రాంతాల గుర్తింపు

మనుబోలు: తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టామని తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ జలజాక్షి తెలిపారు సోమవారం వారు వేర్వేరుగా రెవెన్యూ మనుబోలు మండల కేంద్రంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రమౌళినగర్‌తోపాటు సంగమేశ్వర గిరిజన కాలనీ, చెరువు కట్ట ప్రాంతం, బద్దెవోలు గ్రామంలోని గిరిజన కాలనీ, కొలనకుదురు, కట్టువపల్లి గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలను గుర్తించామన్నారు. ప్రజలను అప్రమత్తం చేశామని తెలిపారు. భారీ వర్షాలు కురిస్తే ఈ ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. తీర ప్రాంత గ్రామాల వారి కోసం కొలనకుదురులోని తుఫాను షెల్టర్‌ను సిద్ధం చేసినట్లు తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. వారి వెంట వీఆర్వో నాగార్జునరెడ్డి, కొలనకుదురు సర్పంచ్ వెంకటరమణయ్య, పంచాయతీ కార్యదర్శులు గరుడయ్య, బాబురెడ్డి, దీపిక, వీఆర్‌ఏ శంకర్ ఉన్నారు.

అందుబాటులో ఉండాలి

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ సుబ్బయ్య ఆదేశించారు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో సోమవారం ఆయన తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. గాలుల తీవ్రతకు ఎక్కడైనా చెట్లు కూలిపోతే వెంటనే తొలగించేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు.

తుఫాన్ షెల్టర్ల పరిశీలన

ముత్తుకూరు: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం ముత్తుకూరు తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి మండలంలోని కృష్ణపట్నం, పైనాపురం తీర ప్రాంతంలో పర్యటించారు. లోతట్టు ప్రాంతాల వారిని తరలించేందుకు తుఫాను షెల్టర్లను పరిశీలించారు. అనంతరం పోలీసులు, వీఆర్వోలతో సమీక్ష జరిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మండలంలో 52 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని ఆయన తెలిపారు. భారీ వర్షాలకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చూడాలని కోరారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పొదలకూరు: భారీ వర్షం కురవడంతో కొద్దిరోజులు నిమ్మతోటలు బెట్ట నుంచి తేరుకుని పూత పూసే అవకాశం ఉంటుంది. అయితే ఎక్కడా చెరువుల్లోకి నీరు చేరడం, వాగులు, వంకలు పొంగి ప్రవహించడం జరగలేదు. తహసీల్దార్ శివకృష్ణ మాట్లాడుతూ ఎక్కడా నష్టం వాటిల్లలేదని, వీఆర్వోలు ఆయా గ్రామాల్లో కురిసిన వర్షం వివరాలు తెలుసుకున్నట్లు చెప్పారు. రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. రాత్రి వేళల్లో వీఆర్వోలను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల వారిని అప్రమత్తం చేశామన్నారు.

అప్రమత్తంగా ఉండండి

- నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



కోవూరు : తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో కోవూరు నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆయన సోమవారం ప్రకటన విడుదల చేశారు. మండల పరిధిలో పెనుగాలులు వీచే అవకాశం ఉందని, పిడుగులు పడే ప్రమాదం ఉంటుందని వెల్లడించారు. పశువులకాపర్లు, రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప బయటకు రావద్దని కోరారు. ముఖ్యంగా చెట్ల కింద, కరెంట్ స్తంభాల కింద ఉండకుండా ఇంట్లోనే సురక్షితంగా ఉండాలన్నారు. తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు వేటకు వెళ్లకుండా సురక్షిత ప్రాంతాల్లో జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.


వెంకటాచలం: గొలగమూడిలోని ఎస్సీ కాలనీలో జేసీబీతో పనులు


బుచ్చిరెడ్డిపాళెం : సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి


ఇందుకూరుపేట : మైపాడు బీచ్‌లో ఎగసిపడుతున్న అలలు


ముత్తుకూరు: కృష్ణపట్నం తుఫాన్ షెల్టర్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్


ముత్తుకూరు: సమీక్ష చేస్తున్న అధికారులు.


ఇందుకూరుపేట : తుఫాన్ షెల్టర్ భవనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ


పొదలకూరులో కురుస్తున్న వర్షం